AKSHARA TODAY


అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

13-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## చెరువుకు చేరనున్న చేప..


2

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..


2

## మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ జాకెట్లు అందజేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఫోర్ట్ సిటీ ఆధ్వర్యంలో వినాయక్ నగర్‌లో మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ జాకెట్లు అందజేశారు. లయన్స్ పూర్వ గవర్నర్ ఇరుకుల వీరేశం మాట్లాడుతూ తెల్లవారుజామున, రాత్రి వేళల్లో పనిచేసే మున్సిపల్ కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా ప్రత్యేకంగా రేడియం సేఫ్టీ జాకెట్లు తయారు చేయించి పంపిణీ చేశామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఫోర్ట్ సిటీ అధ్యక్షుడు రవీంద్రకుమార్ గుప్త, నాగేశ్వరరావు, గజ్జెల నాగేశ్వరరావు, చింతల గంగాదాస్, కార్పొరేటర్ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.




## నీట్–2027 శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నీట్ 2027 ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జోనల్ ఆఫీసర్ (బాసర జోన్ 2) యుగంధర లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27కు గాను హైదరాబాద్ చిలుకూరు ఫౌండేషన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సీఈవోలో బాలురకు, మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సీఈవోలో బాలికలకు 100 సీట్ల చొప్పున మొత్తం 200 సీట్లకు గాను విద్యార్థులకు ఉచితంగా ఈ శిక్షణ ఇవ్వనున్నారు. 2025-26లో ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి, నీట్ 2026 రాసిన ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు దీనికి అర్హులు. ఎలాంటి దరఖాస్తు రుసుము లేని ఈ శిక్షణ కోసం విద్యార్థులు అధిదారిక http://www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత జిల్లా కోఆర్డినేటర్‌కు సమర్పించాలని సూచించారు.



## ఉర్దూ మీడియం పాఠశాలలో సోషల్ ఆడిట్

**అక్షరటుడే, నందిపేట్:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రత్యేక పరిశీలకురాలు మమత ఆధ్వర్యంలో స్టేట్ టీం సభ్యులు నూతన్, బిందు సోషల్ ఆడిట్ నిర్వహించారు. పరీక్షల విభాగం, సైన్స్ ల్యాబ్, స్పోర్ట్స్ రూం, గ్రంథాలయము, పాఠశాల ఆదాయం ఖర్చుల లెక్కలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల గ్రామ పెద్దలు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించి సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, సర్పంచ్ ఎర్రం లింగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ రజిత, వార్డ్ మెంబర్ సలీం, నీలోఫర్ మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ కలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ బల్దియాలో

# 'మామూళ్ల' పర్వం..



**ఆర్మూర్ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతోంది. చిరుద్యోగులను టార్గెట్ చేసుకున్న ఓ బడా ఉద్యోగి హాజరు పేరుతో వేధిస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ప్రస్తుతం బల్దియాలో హాట్ టాపిక్‌గా మారింది.**

– అక్షరటుడే, ఆర్మూర్

- **ప్రతినెల రూ..20వేలు ఇస్తేనే హాజరు..!**
- **నాల్గో తరగతి ఉద్యోగులపై అధికారి ప్రతాపం**
- **ఆర్నెళ్లుగా వేధింపులు**
- **రిటైర్డ్ అయ్యేవరకు ఇవ్వాలంటూ హుకుం**

ఆర్మూర్ మున్సిపాలిటీలో రెవెన్యూ, శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ ఇలా పలు విభాగాలు ఉంటాయి. ఇందులో ఓ విభాగానికి చెందిన అధికారి అదే మున్సిపాలిటీలో పనిచేసే ఓ నాల్గో తరగతి ఉద్యోగిని డబ్బులు ఇవ్వాలంటూ వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగి ప్రతినిత్యం విధులకు హాజరవుతున్నప్పటికీ నెలకు కచ్చితంగా తనకు రూ.20వేలు ఇవ్వాలని లేకుంటే హాజరు వేయనని, ఉద్యోగంలో నుంచి తీసివేయిస్తానంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో సదరు ఉద్యోగి ఆర్నెళ్లుగా ప్రతినెలా రూ.20వేల చొప్పున అధికారికి ఇస్తూ వచ్చినట్లు తెలిసింది. తనను అధికారి వేధింపులకు గురి చేయడంతో ఏమి చేయాలని పరిస్థితుల్లో సదరు ఉద్యోగి కన్నీటి పర్యంతమయ్యాడు. ఎక్కడ అధికారిపై ఫిర్యాదు చేస్తే అంతా తనపై పగపడతారోనని.. పదవీ విరమణ దగ్గర పడుతున్న సమయంలో అధికారులతో పెట్టుకోవడం ఎందుకని తనలో తానే కుమిలిపోతున్నాడు.

### అలాంటేదేమీ లేదు..

కాగా.. సదరు అధికారిని 'అక్షరటుడే' ఈ వ్యవహారంపై సంప్రదించగా అలాంటిదేమీ లేదని ఆ ఉద్యోగిని పిలిపిస్తే తాను మాట్లాడుతానని చెప్పుకొచ్చారు. అనంతరం ఆ అధికారి చిరుద్యోగిని కలిసి ఇప్పటినుంచి తనను కలవొద్దని.. ఏమీ ఇవ్వవద్దని చెప్పినట్లు సమాచారం. ఇప్పటినుంచి తనకు ఏం ఇవ్వవద్దని చెప్పడం వరకు బాగానే ఉంది కానీ అప్పటివరకు ఇచ్చిన డబ్బుల సంగతి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సదరు ఉద్యోగి బారిన పడిన వారు ఇంకా చాలామంది ఉన్నట్లు సమాచారం.

### నా దృష్టికి రాలేదు..

ఉద్యోగి నుండి డబ్బులు తీసుకునే విషయం నా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా రాసిస్తే ఖచ్చితంగా యాక్షన్ తీసుకుంటాను. సదరు ఉద్యోగి వచ్చి కలిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి సదరు అధికారిపై చర్యలు తీసుకుంటాను. బల్దియాలో అవినీతికి తావులేకుండా చేస్తాను. ఉద్యోగులు ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు.

**– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్**

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు చేయాలి..


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15న చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈనెల 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 2గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈనెల 15న ఉదయం వేళ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారుఅదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,



ఆర్డీవో రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీవో సందీప్, డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీవో సాయన్న, సీపీవో కిషన్ పాల్గొన్నారు.

### చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలి

చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.



## శ్రీరాంసాగర్‌లో 43 టీఎంసీలకు చేరిన నీటినిల్వ

**అక్షరటుడే, మెండోరా:** మహారాష్ట్ర లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్ జలశయానికి వరద తగ్గింది. జిల్లాలోనూ వానలు లేకపోవడంతో స్వల్ప ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. శ్రీరాంసాగర్ జలాశయానికి ప్రస్తుతం 2,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1,079.40 అడుగుల (43.371 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 482 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,013 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది.



## భీమ్‌గల్ తహశీల్దార్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ తనిఖీలు

**భీమ్‌గల్, అక్షరటుడే:** మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వివిధ సేవలపై సమీక్షించారు. ముఖ్యంగా 'భూభారతి' పోర్టల్‌లోని పెండింగ్ దస్త్రాలను, దరఖాస్తుల స్థితిగతులను సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.
భూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పోర్టల్‌లో దస్త్రాల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేష్, స్వాతి, కార్యాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా తీజ్ పండుగ

**అక్షరటుడే, మాక్లూర్:** కృష్ణానగర్ తండాలో గురువారం స్థానికులు తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ పండుగను లంబాడ గిరిజనులు ఎంతో ప్రాధాన్యతగా జరుపుకుంటారు. గోధుమ గింజలను 15 రోజులపాటు మొలకలు వచ్చే వరకు ఉంచి ప్రతి కుటుంబం భక్తి భావంతో పూజలు చేస్తారని తండా నాయకుడు రమేష్ తెలిపారు. అనంతరం తమ ఆరాధ్య దైవమైన జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ లకు సమర్పించి మొక్కలు సమర్పిస్తారని చెప్పారు. బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ సంతోషాన్నిస్తుందని గుర్తుచేశారు.

## నేను అమ్ముడుపోయే వ్యక్తిని కాదు: ఎమ్మెల్యే పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** రాజకీయ జీవితంలో తాను ఏనాడు ఏ పార్టీకి అమ్ముడు పోలేదని.. అలాంటి వ్యక్తిని కానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండలంలోని జాకోర, శంకోర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించారు. జాకోర గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని, జాకోర ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయం, ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం శంకోర గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తాను అటు పోతున్నా, ఇటు పోతున్నా అంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. ప్రజల కోసమే తన జీవితం, ప్రజా సంక్షేమం కోసమే తన ఆలోచనలు ఉంటాయని స్పష్టం చేశారు. తనకు ఒక్కపైసా కూడా అవసరం లేదని, ప్రజల ఆశీర్వాదంతో ఏడు దఫాలుగా ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడంలో తనకు ఎలాంటి స్వార్థ ప్రయోజనం లేదన్నారు. తాను స్వార్థం కోసం ఏదైనా పని చేసినట్లు ఎవరైనా నిరూపిస్తే చూపించాలని సవాల్ చేశారు. 'నేను అమ్ముడుపోయే వ్యక్తిని కాదు.. నాకు ఎవరైనా డబ్బులు



ఇచ్చారా..? అని ప్రశ్నించారు. బీర్కూర్‌లో జరిగిన కార్యకర్తల సమ్మేళనంలో తాను మాట్లాడిన మాటల్లో ఎలాంటి రహస్యం లేదని, ఉన్న మాటను ఉన్నట్లుగానే చెప్పానని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఫంక్షన్ హాల్ మంజూరు చేస్తే ఆయన పేరును చెప్పానని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పోతంగల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తే ఆ విషయాన్ని కూడా చెప్పడం తన ధర్మమని పేర్కొన్నారు. తలదించుకుని పనిచేసే రాజకీయ నాయకుడిని తాను కాదని పోచారం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో విజయకుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధిలో జిల్లాకు అన్యాయం

**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యారంగ అభివృద్ధిలో కామారెడ్డి జిల్లా కు అన్యాయం జరుగుతోందని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మిర్కర్ వినయ్ కుమార్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికీ, జిల్లా కేంద్రమైన కామారెడ్డి నియోజకవర్గానికి మాత్రం మంజూరు చేయలేదని విమర్శించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య అందించే ఈ పాఠశాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే వేలాది మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పూలే జయంతి సభలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వారం రోజుల్లో కామారెడ్డికి స్కూల్ మంజూరు అవుతుందని హామీ ఇచ్చినప్పటికీ నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ వంటి పీజీ కోర్సులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కోర్సుల కోసం విద్యార్థులు ఇతర జిల్లాలు, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుండటంతో పేద కుటుంబాలపై ఆర్థిక




భారం పెరుగుతోందని తెలిపారు. భిక్కనూరు మండలం గుర్జకుంటలో కేటాయించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా కామారెడ్డిలోనే ఏర్పాటు చేయాలని కోరారు. యంగ్ ఇండియా స్కూల్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు, ఏటీసీ విషయంలో కామారెడ్డి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెంటనే చొరవ తీసుకోవాలని కోరారు. పాషా, చందు, అశ్విని, నోమన్, ప్రణయ్, రిత్విక, వేణు, హిమశ్రీ, యాసిన్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించాలని బీజేపీ ఇందూరు మహిళా మోర్చా అధ్యక్షురాలు మారెడ్డి వనిత అన్నారు. నగరంలోని వీఆన్ఆర్ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలను అందజేశారు. నగరంలోని 16వ డివిజన్ లోని వీఎన్ఆర్ పాఠశాలలో రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాలను విద్యార్థులకు అందజేశారు. ప్రతి ఇంటిపై ఈనెల 15 వరకు జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 16వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి అనిత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు ప్రసూన, కల్పె అర్చన, మమత, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు నీలిమ, మహిళా మోర్చా కార్యకర్తలు కీర్తి, స్వరూప పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పాల్గొని జాతీయ జెండాను చేతబూని కార్యకర్తలు, నాయకులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో నడిచారు. గాంధీ గంజ్ నుంచి మొదలైన ఈ ర్యాలీ జేపీఎన్ రోడ్, సుభాష్ రోడ్, ధర్మశాల, ఇందిరా చౌక్, రైల్వే కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు సాగింది. నిజాంసాగర్ చౌరస్తాలో జనగణమన జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, బీజేపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# చెరువుకు చేరనున్న చేప..




> ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆలస్యమైన ఉచిత చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం చివరకు గ్రీన్ సిగ్నల్ వేసింది. ఇటీవల కురిసిన వర్షా లకు జలవనరులు నిండడంతో మత్స్యకారుల్లో ఆశలు చిగురించాయి.
> – అక్షరటుడే, ఎల్లారెడ్డి

- ఉచిత చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- వర్షా లతో నిండిన చెరువులు
- మత్స్యకారుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో 6 కోట్ల చేపపిల్లలు లక్ష్యం

సాధారణంగా ఏటా జూన్, జూలై నెలల్లో చేప పిల్లల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టు, సెప్టెంబరులో జలవనరుల్లో వదులుతారు. కానీ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడంతో టెండర్ల ప్రక్రియ వాయిదా పడింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండడంతో మత్స్యశాఖ కమిషనర్ నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నెలాఖరు వరకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత చేప, రొయ్య పిల్లలను నీటి వనరుల్లో వదిలేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలోపే నీటి వనరులను గుర్తించే పనులు చేపట్టనున్నారు.

### కామారెడ్డి జిల్లాలో..

జిల్లాలో మొత్తం 765 జలవనరులు, 249 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. ఇందులో పురుషులకు సంబంధించిన సంఘాలు 195 ఉండగా.. 11,472 మంది సభ్యులు ఉన్నారు. అలాగే మహిళా సంఘాలు 45 ఉండగా 1,291 మంది సభ్యులు ఉన్నారు. ఇతర సంఘాలు 9 ఉండగా అందులో 992 మంది సభ్యులై ఉన్నారు. మొత్తంగా 13,755 మంది మత్స్యకారులు జిల్లాలో ఉన్నారు. మండలాల వారీగా నిజాంసాగర్‌లో 24 సంఘాలు (1,002 మంది), లింగంపేటలో 23 (851 మంది), మాచారెడ్డిలో 19 (1,159 మంది) ఉన్నాయి. అత్యధిక సభ్యులున్న మండలం మాచారెడ్డి. ఇందులో 1,159 సభ్యులున్నారు. బీబీపేట్‌లో 1,092 మంది సభ్యులుగా ఉన్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో 796 నీటి వనరులు, 38 మత్స్యకార సంఘాలు ఉండగా అందులో 24,178 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,561 చెరువులు ఉండగా, ఈ ఏడాది 6 కోట్ల చేప పిల్లలను విడుదల చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది కామారెడ్డి జిల్లాలోని 739 చెరువుల్లో 1.25 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. త్వరగా పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. గతంలో 2.87 కోట్లకు గాను కేవలం 1.24 కోట్ల చేప పిల్లలను మాత్రమే వదిలారనే విమర్శలు ఉన్నాయి.

### నాణ్యతపై ఆరోపణలు

చేప పిల్లల పంపిణీలో నాణ్యత, కొలతలు, లెక్క ప్రకారం చేప పిల్లలు వదలడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. టెండర్లు ఖరారు చేసేటప్పుడు నాణ్యమైన చేప పిల్లలను సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ..ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఇందుకు సంబంధించి పనులు చేస్తున్నామని.. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 2.50 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.



## విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

**అక్షరటుడే, బాల్కొండ:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత నోట్ బుక్స్‌ను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచితంగా అందించిన నోట్ బుక్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రసీదుద్దీన్ అస్లాం, లైబ్రేరియన్ అబ్దుల్ నబీ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగారాం, అబ్రార్, మురళి, శ్రీనివాస్, సాయి ప్రసాద్, సంతోష్, సంతోష్, అనూష, యశస్విని, నికత్ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.



## ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు..

**అక్షరటుడే, మాక్లూర్:** మండలంలోని బోర్గాం(కె) గ్రామం వద్ద గురువారం ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. గొట్టుముక్కల గ్రామం నుంచి ఒడ్యాట్‌పల్లి గ్రామానికి అంత్యక్రియల కోసం ఆటోలో వెళ్తున్నారు. బోర్గాం శివారులో అదుపుతప్పి ఆటో పల్టీకొట్టడంతో డ్రైవర్‌తో సహా ముగ్గురు మహిళలకు గాయాలు అయ్యాయి.

## భారీగా నల్లబెల్లం, పటిక పట్టివేత



**అక్షరటుడే, కామారెడ్డి:** నాటు సారా తయారీకి ఉపయోగించే ముడి సరుకును అక్రమంగా తరలిస్తున్న వ్యక్తితో పాటు నిల్వ ఉంచిన మరొక వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద మొత్తం 220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా ఉన్న ఓ కారును ఆపి పరిశీలించారు. అందులో 60 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటిక లభించింది. బెల్లాన్ని తరలిస్తున్న వీర్నపల్లి గ్రామానికి చెందిన బుక్యా గంగును విచారించగా గంజ్ మార్కెట్ లోని కృషకుమార్ మర్చంట్ వద్ద 160 కిలోల నల్లబెల్లం, 54 కిలోల పటిక ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. వీరి వద్ద మొత్తం 220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటిక లభించగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. నాటు సారాయి తయారీ చేసినా, ముడి సరుకు రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, ఎస్సై విక్రమ్, హెడ్ కానిస్టేబుల్ జాన్, కానిస్టేబుల్స్ ఘోరీ, పవన్ కుమార్, రాజు, బాబు, శరత్ చంద్ర పాల్గొన్నారు.

## భీమ్‌గల్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ




**అక్షరటుడే, భీమ్‌గల్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని 1 నుంచి 6వ వార్డుల పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ తిరిగి మహిళలకు మొక్కలను అందజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, కమిషనర్ డి. గజానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు (1వ వార్డు), పర్స కుశలత అనంతరావు (2వ వార్డు), తోట సతీష్ (3వ వార్డు), గుణాల బాలలక్ష్మి (4వ వార్డు), లావణ్య నరసయ్య (5వ వార్డు) పాల్గొని స్థానిక మహిళలకు పండ్ల, నీడనిచ్చే మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. భీమ్‌గల్ పట్టణాన్ని హరిత వనంగా మార్చేందుకు పౌరులంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**అక్షరటుడే, గాంధారి:** ప్రభుత్వ జూనియర్ కళాశాల గాంధారిలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్ పుస్తకాలను డీఐఈవో షేక్ సలాం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్‌బుక్‌స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కష్టపడి చదివి గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సదుపాయాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు కళాశాల పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, అధ్యాపకులు, రాజగోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, విజయకుమార్, రమేష్, సంబాజి, సరిత, సుజాత, స్వప్న, మమత, మల్లయ్య, తేజ, నాన్ టీచింగ్ సిబ్బంది గణేష్, ఆరిఫ్, రాములు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం భీమ్‌గల్ మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, తహశీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ జూలై నెల 2023 నుంచి పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని అలాగే 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకొని, జీవో 25ను సవరించి ప్రతి బడికి కనీసం ఇద్దరు టీచర్లను కేటాయించాలన్నారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ఆగస్టు 15 లోపు విడుదల చేయాలని, జీవో 317 బాధితులను సొంత జిల్లాలకు పంపాలని కోరారు. ఎం. మల్లేష్, జి. ఈశ్వర్, పి. లింగయ్య, ఎం. జనార్దన్, ఏ. రమేష్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం



**అక్షరటుడే, ఆర్మూర్:** జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులోని గోవింద్‌పేట్ వంతెన వద్ద 44వ జాతీయ రహదారిపై బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. కొందరు ప్రయాణికులు మహారాష్ట్ర నాందేడ్ కిన్వట్ నుండి హైదరాబాద్ లోని ముచ్చింతల్ తీర్థయాత్రకు రెండు బస్సులతో బయలుదేరారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద ఓ బస్సు టైర్ పంచర్ కావడంతో రెండు బస్సులు హైవేపై నిలిచిపోయాయి. అయితే కొందరు ప్రయాణికులు డివైడర్‌పై కూర్చుని సేద దీరుతున్నారు. అయితే రహదారిపై ఆగి ఉన్న బస్సును వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఆ బస్సు ముందుకు కదలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికుల మీదికి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సుజాత, మాధవి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీపీ సాయిచైతన్య హుటాహుటిన ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తదితరులు సీపీ వెంట ఉన్నారు.




## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**అక్షరటుడే, మెండోరా:** పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ దశల వారీగా పోరాటం చేస్తోంది. మొదటి దశలో భాగంగా ఈ నెల 7న పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రెండో దశలో భాగంగా గురువారం మెండోరా మండల తహశీల్దార్ ద్వారా సీఎంకు యూఎస్పీసీ నాయకులు మెమోరాండం సమర్పించారు. యూఎస్పీసీ నాయకుడు రమేష్ మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా నూతన పీఆర్సీని అమలు చేయలేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి రూ.కోట్లల్లో బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## మహిళకు విజయవంతంగా అకలాసియా సర్జరీ




**అక్షరటుడే, కామారెడ్డి:** గత ఆర్నెల్లుగా ఆహారం మింగడంలో ఇబ్బందిపడుతున్న మహిళకు అకలాసియా సర్జరీని విజయవంతంగా నిర్వహించామని యశోద ఆస్పత్రి సికింద్రాబాద్ బ్రాంచ్ గ్యాస్ట్రో ఎండీ, డీఎం శ్రుతి సాగర్ తెలిపారు. గురువారం ఆయన కామారెడ్డి యశోద బ్రాంచ్ మెడికల్ క్లినిక్ లో మీడియాతో మాట్లాడారు. గత ఆర్నెల్లుగా తీవ్రమైన దగ్గు, ఛాతీ నొప్పితో సదరు మహిళ అనేక ఆస్పత్రులు తిరిగినా ఫలితం లభించకపోవడంతో యశోద కామారెడ్డి బ్రాంచ్ క్లినిక్‌లో సంప్రదించిందని వైద్యుడు శ్రుతిసాగర్ పేర్కొన్నారు. ఇక్కడి బ్రాంచ్‌లో మహిళకు ఎండోస్కోపి ద్వారా ఆహారం, నీరు మధ్యలోనే నిలిచిపోతున్నట్టు గుర్తించి సికింద్రాబాద్ బ్రాంచికి రిఫర్ చేశారన్నారు. ఆమెకు అత్యాధునిక పెర్‌ఓరల్ ఎండోస్కోపిక్ మయోటమీ ప్రక్రియ చేయాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. గత నెల 20న ఈ ప్రక్రియను ఎటువంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కామారెడ్డి బ్రాంచ్ క్లినిక్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.